# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

పత్రికా ప్రకటన

అక్టోబర్ 10, 2013

# ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికలను బహిష్కరించండి!

# క్రాంతికారీ జనతన సర్కారే దోపిడీ వ్యవస్థకు ఏకైక ప్రత్యామ్నాయం!

**అవినీతికర, ప్రజావ్యతిరేక, దేశద్రోహకర, ఫాసిస్టు కాంగ్రెస్, బీజేపీలను తన్ని తరమండి!**

వచ్చే నవంబర్ 11, 19 తేదీలలో ఛత్తీస్‌గఢ్ విధానసభకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలంటే దోపిడీదార్లలో ఏయే సభ్యులు రానున్న ఐదేళ్ల పాటు ప్రజలను దోచుకుంటారో, పీడిస్తారో నిర్ణయించే సందర్భం మాత్రమే. కాని దీనిని 'ప్రజాస్వామ్యపు పండుగ' అని అభివర్ణిస్తూ ప్రజలను మోసగిస్తున్నరు. సామ్రాజ్యవాద-నిర్దేశిత విధానాలను అమలు చేయడంలో, భూస్వామ్య - నిరంకుశ దళారీ పెట్టుబడిదారీ వర్గాల సేవలో అన్నిటికన్నా ముందుండే కాంగ్రెస్, బీజేపీలు పరస్పర ఆరోపణలతో, దూషణలతో తమ దివాళాకోరుతనాన్ని నిర్లజ్జగా ప్రదర్శించుకుంటున్నయి. బీజేపీ కొన్ని నెలల ముందు నుండే 'వికాస్ యాత్ర' పేరుతో తన ఎన్నికల క్యాంపెయిన్‌ను ప్రారంభించగా, వరుసగా రెండు సార్లు పరాభవాన్ని చవి చూసిన కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నది. 'పరివర్తన్ యాత్ర' పేరుతో ప్రారంభించిన దాని ఎన్నికల క్యాంపెయిన్‌కు జీరంఘాటీ దాడితో ఎదురుదెబ్బ తగలగా అది ప్రజల 'సానుభూతి'ని వోట్లుగా మల్చుకోవడం కోసం తిరిగి 'బలిదానీ మాటి కలశ్ యాత్ర'ను ప్రారంభించింది.

మరోవైపు రివిజనిస్టు పార్టీలైన సీపీఐ, సీపీఎంలు; తనను తాను దళిత-బహుజనుల పెన్నిధిగా చెప్పుకునే బీఎస్‌పీ; ఇంకా ఎన్‌సీపీ, ఛత్తీస్‌గఢ్ స్వాభిమాన్ మంచ్, గోండ్వానా గణతంత్ర్ పార్టీ తదితర ఎన్నికల పార్టీలు పొత్తు కుదుర్చుకొని మూడో ఫ్రంట్ పేరుతో ఎన్నికల బరిలోకి దిగుతున్నయి. కాగా పీ.ఏ. సంగ్మా నాయకత్వంలోని ఎన్‌పీపీ ఈ ఫ్రంట్ నుండి బైటికి వచ్చి పోటీ చేస్తున్నది. ఈ ఎన్నికల పార్టీలన్నీ వోట్లు దండుకోవడం కోసం ప్రజల 'అభివృద్ధే' తమ లక్ష్యమని చెబుతూ ఊపిరి సలపనివ్వని ముమ్మర ప్రచారం చేస్తున్నయి.

వాస్తవం ఏమిటంటే గత 65 ఏళ్ల 'స్వతంత్ర' పాలనలో అనేక సార్లు ఎన్నికలు జరిగినయి. ఎన్నో ప్రభుత్వాలు మారినయి. కాని కూడు, గూడు, గుడ్డ వంటి ప్రజల మౌలిక అవసరాలు కూడ నేటికీ తీరలేదు. నేటికీ దేశ పీడిత ప్రజలు ఆకలిచావులు, పేదరికం, నిరుద్యోగం, అధిక ధరలు, రోగాలు, అవినీతి వంటి సమస్యలతో సతమతమవుతున్నరు. 77 శాతం దేశ జనాభా రోజుకు 20 రూపాయలకన్నా తక్కువ ఆదాయంతో బతుకులీడుస్తున్నది. మరోవైపు అంబానీలు, టాటా, బిర్లా, మిత్తల్, వేదాంత, జిందల్ వంటి కేవలం వంద కార్పొరేట్ దిగ్గజాల మొత్తం ఆస్తులు దేశ జీడీపీలో నాలుగో వంతుకు ఎదిగినయి. అంటే పేదలకూ, ధనికులకూ మధ్య అంతరం చెప్పలేని స్థాయికి పెరిగిపోయింది. అవినీతి, కుంభకోణాలు లెక్కలేనంతగా పెరిగిపోయినయి. ఈ కారణంతో దేశంలో సామాజిక అశాంతి పెరుగుతూ పోతున్నది.

మరోవైపు పోరాట ప్రాంతాలలో గ్రామాలపై దాడులు, సెర్చ్ ఆపరేషన్స్, అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు నిరాటంకంగా జరుగుతున్నయి. వేలాది అదనపు సాయుధ బలగాలను మోహరించే సన్నాహాలు జరుగుతున్నయి. ఎన్నికలను 'నిష్పక్షపాతంగా', 'స్వేచ్ఛగా' జరిపే పేరుతోనే ఇవన్నీ జరుగుతుండడం గమనార్హం. అంటే ఈ ఎన్నికలు కూడ, ప్రత్యేకించి పోరాట ప్రాంతాలలో తుపాకీ నీడలోనే జరగబోతున్నాయన్న మాట.

ఛత్తీస్‌గఢ్ ప్రజలు గత పదేళ్లుగా హిందూ మతోన్మాద బీజేపీ పాలనను భరిస్తున్నరు. ఇప్పుడది నరేంద్ర మోదీని తన ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించి ఫాసిజం వైపు మరింత ముందుకు పోనున్నట్టు చెప్పకనే చెప్పింది. ఒకవేళ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మైనారిటీ మతస్తులకే కాదు, ఆదివాసుల అస్తిత్వానికీ, ఆత్మగౌరవానికీ కూడ ప్రమాదకరమే. ఇక గత పదేళ్లుగా యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశాన్ని అన్ని రంగాల్లోనూ దిగజార్చివేసింది. 2జి స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్ ఆటలు, బొగ్గు కుంభకోణం వంటి మహా కుంభకోణాలతో అది లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దిగమింగింది. సామ్రాజ్యవాదులతో అది లెక్కలేనన్ని ఒప్పందాలు చేసుకుంది. రెండో దశ ఆర్థిక సంస్కరణల అమలును వేగంగా ప్రారంభించింది. చిల్లర వర్తకాన్ని పూర్తిగా సామ్రాజ్యవాద కంపెనీలకు కట్టబెట్టే విధానాలను చేపట్టింది. దేశంలోని ప్రకృతి సంపదలన్నిటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించి దేశాన్నంతా గుల్లగా మారుస్తున్నది. ప్రజలను పెద్ద ఎత్తున నిర్వాసితుల్ని గావించే విధానాలను అమలు చేస్తున్నది. కాంగ్రెస్, బీజేపీల విధానాలలో తేడా ఏమీ లేదనేది స్పష్టమే.

రమణ్ ప్రభుత్వం 'అభివృద్ధి' గురించి పెద్దగా గొప్పలు చెప్పుకుంటున్నది. న్యాయంగా ప్రజలకు చెందాల్సిన విలువైన ప్రకృతి సంపదలను అది బడా పెట్టుబడిదార్లకు, సామ్రాజ్యవాదులకు అడ్డికి పావుశేరు లెక్కన తెగనమ్ముతూ మరోవైపు అది ఇలాంటి అబద్ధపు, భ్రమగొల్పే

ప్రచారం చేస్తున్నది. పేద ప్రజలకు చౌకగా బియ్యం, పప్పు, ఉచితంగా ఉప్పు అందజేసే పథకాన్ని తానే అమలు చేస్తున్నట్టు చెప్పుకుంటూ రమణ్‌సింగ్ తనను తాను 'చవుంర్ వాలే బాబా' (బియ్యం ఇచ్చే బాబా)గా ప్రచారం చేసుకుంటున్నాడు. నిజానికి ఈ పథకం అమలులో రాజ్యమేలుతున్నది అవినీతి మాత్రమే. కార్పొరేట్ దోపిడీకి దారి సుగమం చేసేందుకు చేపడుతున్న రోడ్ల నిర్మాణం, విద్యుత్ ప్లాంట్లు వంటి ప్రాజెక్టులను 'ప్రజల అభివృద్ధి'గా చిత్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ కూడ రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొనే ఆదరాబాదరాగా 'జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని' తెచ్చింది. ప్రపంచంలో ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులలో 25% మన దేశంలోనే వుండగా, ప్రభుత్వం ఈ చట్టం ద్వారా మనిషికి నెలకు ఐదు కిలోల బియ్యంతో కడుపులు నింపేస్తానని నమ్మబలుకుతున్నది. నిజానికి ఈ పథకాలు తెస్తున్నది ప్రజలపై ప్రేమతో కానే కాదు. సామ్రాజ్యవాద నిర్దేశిత ఆర్థిక విధానాల అమలు మూలంగా ప్రజల హృదయాల్లో రగులుతున్న క్రోధాన్ని శాంతిపజెయ్యడమే వీటి లక్ష్యం.

రైతుల పట్ల ఘోర నిర్లక్ష్యం కొనసాగుతున్నది. బహుళజాతి కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం వ్యవసాయ రంగాన్ని క్రమక్రమంగా కార్పొరేట్ సంస్థలపరం చేయడం వాళ్ల లక్ష్యం. 2000 నుండి 2011 మధ్య రాష్ట్రంలో 14,340 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 'ధాన్ కా కటోరా' (ధాన్యపు పాత్ర)గా పేరు గాంచిన ఛత్తీస్‌గఢ్‌లో రైతులకు బతుకే భారంగా మారిపోయింది.

విద్యా, వైద్య రంగాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెపుతూ పీడిత ప్రజలను క్రమంగా ఈ సదుపాయాలకు దూరంగా నెట్టివేస్తున్నరు. ప్రభుత్వ పాఠశాలలు టీచర్ల కొరత, సౌకర్యాల లేమి, భద్రత కరువై పోవడం వంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సర్కారీ ఆసుపత్రులలో, ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, వైద్య సిబ్బందికి సంబంధించిన ఖాళీ పోస్టులు నింపడం లేదు. 'స్మార్ట్ కార్డ్' ద్వారా పేద వాళ్లకు ఉచితంగా వైద్యం చేయిస్తాననే సాకుతో ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రుల యజమానులతో కుమ్మక్కయ్యి భారీ అవినీతికి పాల్పడుతున్నది. ఒకవైపు రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉత్పత్తి గురించి గప్పాలు కొడుతుండగా మరోవైపు లోవోల్టేజ్ సమస్య రైతులను కుంగదీస్తున్నది. రాష్ట్రంలో నేటికీ కార్మికులు 10 నుండి 12 గంటలు పని చేస్తున్నారు. కనీస వేతనాల చట్టాన్ని సర్వత్రా ఘోరంగా అపహాస్యం చేస్తున్నారు. బోనస్, భీమా, సెలవు మొదలైన కనీస కార్మిక చట్టాలను కూడ బాహాటంగా ఉల్లంఘిస్తున్నరు. పెట్టుబడిదార్ల, యజమాన్యాల నేరపూరిత నిర్లక్ష్యం ఫలితంగా పదుల సంఖ్యలో కార్మికులు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నరు.

ఆదివాసీ ప్రాంతాలలో రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్, పెసా మొదలైన చట్టాలు ఘోరంగా ఉల్లంఘించబడుతున్నయి. తుపాకీ నీడన గ్రామసభలను నిర్వహించి ప్రజలను బలవంతంగా భూస్వాధీనానికి ఒప్పిస్తున్నారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన భూ అధిగ్రహణ చట్టం ప్రజల నుండి పెద్ద ఎత్తున భూముల్ని గుంజుకొని కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టే ఉద్దేశ్యంతో తయారు చేసినదే. మరోవైపు వాస్తవం ఏమిటంటే జల్-జంగల్-జమీన్ సమస్యపై ఉద్యమిస్తున్న వాళ్లను తప్పుడు కేసుల్లో ఇరికించి జైలు పాలు జేస్తున్నరు.

శిక్షాకర్మీలు, ఉపాధ్యాయులు, నాల్గో తరగతి ఉద్యోగులు, పంచాయితీ కార్యదర్శులు, అటవీశాఖ ఉద్యోగులు, పట్వారీలు, ఆంగన్‌వాడీలు – ప్రతి విభాగానికి చెందిన ఉద్యోగులు రమణ్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలతో విసిగిపోయి అనేక సార్లు సమ్మెలకు దిగారు. అయితే ప్రభుత్వం ప్రతిసారీ సమ్మెలను నిర్బంధంతోనే ఎదుర్కొంది. మహిళలపై పీడనలో రమణ్ ప్రభుత్వం అన్నిటికన్నా ముందున్నది. సోని సోడిపై అమానుష అత్యాచారానికి బాధ్యుడైన ఎస్.పీ. అంకిత్ గర్గ్‌కు దేశ ప్రప్రథమ మహిళా రాష్ట్రపతి చేతుల మీదుగా శౌర్య పతకం ఇప్పించారు. మీనా ఖల్కోపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన ఖాకీ బట్టల వాళ్లు నేటికీ బోర విరుచుకొని తిరుగుతున్నారు. ఇక ఝులియామారీ దురంతం ముఖ్యంగా ఆదివాసీ విద్యార్థినుల పట్ల ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యాన్ని చాటి చెప్పింది. ఇక విప్లవోద్యమ ప్రాంతాలలో మోహరించబడిన ప్రభుత్వ సాయుధ బలగాలు మహిళలపై పాల్పడుతున్న హింసా, దౌర్జన్యాలకు లెక్కే లేదు.

కార్పొరేట్ మీడియా 'స్వచ్ఛమైన ఇమేజ్'ను ఆపాదించడానికి పూర్తి విరుద్ధంగా రమణ్ ప్రభుత్వం అనేక అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయింది. బొగ్గు కుంభకోణంలో ప్రభుత్వ ఖజానాకు వెయ్యి కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లింది. నియమవిరుద్ధంగా బొగ్గు బ్లాకుల్ని కేటాయించడం, ప్రాస్పెక్టింగ్ లైసెన్సులు జారీ చేయడం, ఇందిరా ప్రియదర్శిని బ్యాంక్ కుంభకోణం, తునికాకు కాంట్రాక్టర్ల నుండి వందల కోట్ల రూపాయల లంచాలు తీసుకోవడం వంటి కుంభకోణాలు ఒకదాని తర్వాత ఒకటి బైటికి వచ్చాయి. గత పదేళ్లలో ఇలాంటి అనేక కుంభకోణాలు బట్టబయలు కాగా మరెన్నో మరుగుపర్చబడ్డాయి.

బీజేపీ ప్రభుత్వం ప్రజలపై, ప్రత్యేకించి ఆదివాసులపై అత్యంత అమానవీయ నిర్బంధాన్ని ప్రయోగించింది. అది కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం అండదండలతో 2005లో 'సల్వాజుడుం' పేరుతో ఒక బీభత్సకర నిర్బంధ క్యాంపెయిన్‌ను నడిపింది. అయితే ఈ ఫాసిస్టు దాడిని పీడిత ప్రజానీకం మా పార్టీ, పీఎల్‌జీఏ నాయకత్వంలో వీరోచితంగా ప్రతిఘటించి ఓడించింది. ఆ తర్వాత, 2009 మధ్యలో కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి విప్లవోద్యమంపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ఒక దేశవ్యాప్త దాడిని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రజలపై యుద్ధం తీవ్రతరమైంది. దక్షిణ బస్తర్‌లోని సింగారంలో 17 మంది ఆదివాసుల రక్తంలో స్నానమాడడంతో బీజేపీ రెండో రౌండ్ పాలన మొదలైంది. కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా దండకారణ్య ప్రాంతాన్నంతా సైనిక క్యాంపుగా మార్చివేశారు. ఛత్తీస్‌గఢ్ జైళ్లల్లో మూడు వేలకు పైగా ఆదివాసులు బందీలుగా వున్నారు. జైలు పరిస్థితులు ఎంత అమానుషంగా వున్నాయంటే సరైన తిండి, వైద్య సదుపాయాలు లేక చాలా మంది నికృష్టంగా చనిపోతున్నారు.

తమ ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు, దేశద్రోహకర, అవినీతికర ముఖంపై చిరునవ్వుల్ని అంటించుకొని కాంగ్రెస్, బీజేపీ నాయకులు వోట్లు అడుక్కోవడం కోసం చేతులు జోడిస్తూ ప్రజల ముందుకు వస్తున్నారు. మిగతా అన్ని రాజకీయ పార్టీలు కూడ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి.

**ఎన్నికల బహిష్కరణ ఎందుకు?**

పార్లమెంటులో గాని, విధానసభలో గాని ప్రజల వాస్తవిక సమస్యలు ఎప్పుడూ చర్చకు రావు. పార్లమెంటు, విధానసభలు సామ్రాజ్యవాదుల, బడా దళారీ వ్యాపార సంస్థల, బడా భూస్వాముల, కాంట్రాక్టర్ల, మాఫియాల నియంత్రణలో వుంటాయి. ఎన్నికల వ్యవస్థ ఒక పెద్ద అబద్ధం. అసలు ప్రజలకు ఈ ఖరీదైన ఉత్సవంతో పనే లేదు. వోట్లను డబ్బులతో, మద్యంతో, మతపరమైన, కులపరమైన సెంటిమెంట్లతో కొనుక్కోగల ఈ వ్యవస్థను ప్రజాస్వామ్యం అని అననే లేం. నేరగాళ్లు, బందిపోట్లు, కుఖ్యాతి గాంచిన అవినీతికర రాజకీయ నాయకులు ఎన్నికల్లో గెలుస్తుంటే, తుపాకీ బలంతో, బూత్‌లను ఆక్రమించుకుంటూ, దొంగవోట్లు వేయించుకుంటూ వుంటే దీన్ని ప్రజాస్వామ్యం అని చెప్పడం హాస్యాస్పదమే అవుతుంది. అందుకే మా పార్టీ ఈ పార్లమెంటరీ వ్యవస్థను బహిష్కరించాలని పిలుపునిస్తున్నది. ఎందుకంటే పార్లమెంటరీ సంస్థలు భ్రమల్ని వ్యాపింపజెయ్యడం తప్ప మరేమీ చెయ్యలేవు. నిజానికి వోట్లు వెయ్యడం, వెయ్యకపోవడం రెండూ ప్రజల ప్రజాస్వామిక హక్కులే. కనుక ఎన్నికల బహిష్కరణ అనేది మన న్యాయమైన హక్కు కూడ.

**మా విజ్ఞప్తి**

ఎన్నికల ద్వారా ప్రస్తుత దోపిడీ వ్యవస్థ అంతం కాదు. ప్రజల ప్రాథమిక అవసరాలు కూడా నెరవేరవు. ప్రస్తుత వ్యవస్థను వేళ్లతో సహా మార్చినపుడే అది సాధ్యమవుతుంది. ప్రజలను నిజమైన ప్రజాస్వామ్యం, స్వావలంబన దిశగా తీసుకుపోయే కార్యక్రమం ఏ దోపిడీ పార్టీకీ లేదనీ, అది కేవలం విప్లవ జనతన సర్కార్‌కు మాత్రమే వుందనీ మనం అర్థం చేసుకోవాలి. ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించాలనీ, దండకారణ్యం సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో రూపు దిద్దుకుంటున్న ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారం, క్రాంతికారీ జనతన సర్కార్‌కు ఆహ్వానం పలకాల్సిందిగా, దానికి మద్దతుగా నిలబడాల్సిందిగా మేం యావత్ ఛత్తీస్‌గఢ్ ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం.



**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**